1993
నుండి
నిరంతర
ప్రచురణ
ఖర : జ్యేష్ఠము
జూన్ 2011

తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్న చరిత్ర

వెల : రూ.10/-

పర్యావరణ దినోత్సవం:
జూన్ 5



## వినమ్ర నివేదన ...



**ఎస్.పి.వై.రెడ్డి,** బి.ఇ.,
**భారత పార్లమెంటు సభ్యులు**
**నంది సంస్థల అధినేత, నంద్యాల.**
**నడుస్తున్న చరిత్ర పోషకులు**

పాలనాభాషగా తెలుగు అమలుకోసం ఎన్నో సౌకర్యాలను మన రాష్ట్ర ప్రభుత్వం కలిగించింది. కార్య నిర్వాహక అధికారాలు లేకపోయినా రాష్ట్ర అధికార భాషా సంఘం, ఇతర ప్రభుత్వ విభాగాలు కలిసి – భారత రాజ్యాంగానికి, 115 కేంద్ర చట్టాలు, 415 రాష్ట్ర చట్టాలకు అధికారపూర్వక తెలుగు అనువాదాలను ప్రచురించారు. పారిభాషిక పదకోశాలు, నమూనా లేఖలు, కార్యాలయ పదావళి, పరిపాలన న్యాయపదకోశం, పదకోశం మీకోసం, హైకోర్టు తీర్పుల సంగ్రహం వంటి ఎన్నో ప్రచురణలను తెచ్చారు. తెలుగును అధికార భాషగా అమలు చేయడానికి అధికారభాషాచట్టం ఉంది. కాని, ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 65 ఏండ్లయినా తెలుగులో పరిపాలన పూర్తిగా కాకపోయినా, మెచ్చుకోదగ్గ పరిమితుల్లోనయినా ఆ చట్టం అమలు కావడం లేదు. దీనికి అసలు కారణం రాజకీయ సంకల్పం లేకపోవడమే. రాష్ట్రాన్ని పరిపాలించే మంత్రివర్గం, అధికారులు తలచుకొంటే ఇది అసాధ్యం ఏమాత్రం కాదు. ముఖ్యమంత్రిగారు ఈ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. స్పీకర్, శాసనమండలి అధ్యక్షుడు కూడా వారి స్థాయిలో గట్టి సంకల్పం చెయ్యాలి. వీరంతా తలచుకొంటేనే ఇది సాధ్య మవుతుంది. పొరుగు రాష్ట్రాలను చూసి అయినా మన నేతలు ఈ విషయంలో ధృఢమైన వైఖరిని చేపట్టాలి. ప్రజాస్వామ్యంలో ప్రజల భాషను గౌరవించడమంటే పరిపాలనను ప్రజలకు సన్నిహితం చెయ్యడమే.

**ఈ పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.**

పర్యావరణాన్ని రక్షించుకోవాలని ఉద్యమాలు నడుస్తూనే ఉన్నాయి. కాని ప్రపంచమంతటా ప్రకృతిని ధ్వంసం చేయడం జరుగుతూనే ఉంది. గాలి, నీరు, భూమి నిరంతరం మానవుల అత్యాచారాలకు గురి అవుతూనే ఉన్నాయి. పక్షులు, ఇంకా అనేక జీవచరాలు శాశ్వతంగా నిర్మూలన అయ్యే పరిస్థితులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిఏడూ జూన్ 5న పర్యావరణదినోత్సవాన్ని మనం జరుపుకొంటున్నాం.

పుటలు :15–16




## లోపలి పుటలలో....


| | | |
|---|---|---|
| **సంపాదక హృదయం :** | | 7 |
| **చూపు** : అత్యంత విస్తృతిగల భాషగా తెలుగును | **జయధీర్ తిరుమలరావు** | 9 |
| **తెలుగుసిరి** : ఆంగ్లేయులకొక పాఠ్యగ్రంథం | **ఆర్వీయస్ సుందరం** | 11 |
| **ప్రత్యేక వ్యాసం** : పోటీ పరీక్షల్లో తెలుగు ప్రాధాన్యం | **ద్వా.నా. శాస్త్రి** | 13 |
| **పర్యావరణ రక్షణ నేటి అవసరం** | **సింధుప్రియ** | 15 |
| **న్యాయపీఠం** : మరణ శాసనం... | **ఎ. రామలింగేశ్వరరావు** | 17 |
| **మార్గ 'సిరా'** : చీకిన చింకి చెప్పుదెబ్బ | **జాన్‌సన్ చోరగుడి** | 20 |
| **పరిశోధన** : తొలి తెలుగు శాసనాలు – పదజాలం | **కె. లావణ్య** | 21 |
| **స్పందనలు** : 'నుడి – నానుడి'పై స్పందనలు | | 24 |
| **హోసూరు మాండలికంలో కత** : కావేరప్ప కూతురు | **కెం. మునిరాజు** | 26 |
| **ప్రాచీన నిఘంటువులు:** కవి చౌడప్ప అచ్చ తెలుగు... | **కుర్రా జితేంద్రబాబు** | 29 |
| **నల్లమలలో చెంచు ప్రపంచం బతుకు కతలు... 4** | **తోకల గురవయ్య** | 35 |
| **జనమాధ్యమాల్లో తెలుగు** : మంచి పోకడలకు... | **నాగసూరి వేణుగోపాల్** | 38 |
| **మహిళల కోసం** : సమస్యలమయం సర్కారీ బళ్ళు.. | **విజయ బక్ష్** | 39 |
| **తెలుగుజాతి వారసత్వ దినోత్సవం వార్తలు** | | 40 |
| **వ్యాఖ్యానం** : అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా | **చలసాని నరేంద్ర** | 42 |
| **'టెట్'లో భాషాపండితుల అభ్యర్థులకు న్యాయం చెయ్యాలి** | | 43 |
| **పుస్తక సమీక్షలు** | | 45 |
| **గ్రంథాలయం** | | 48 |
| **అక్షరాక్షతలు** : బంగారూ... ఏల కంగారూ?! | **కొంపల్లి సుందర్** | 49 |
| **సాహితీరంగ వార్తలు** | | 50 |


కవితలు : **మాడుగుల నారాయణమూర్తి, శింగిసెట్టి సంజీవరావు, సుప్పని సత్యనారాయణ, జొన్నలగడ్డ వెంకటసాంబశివరావు**

కార్టూన్లు : **సరసి, బాబు, శేఖర్**

ముఖచిత్రం : **తమ్మా శ్రీనివాసరెడ్డి** కంప్యూటీకరణ : **లావేటి త్రివేణి, షాకీరా**

సంపాదకుడు : **డా॥ సామల రమేష్‌బాబు**

**నడుస్తున్న చరిత్ర**, జి-2, శ్రీవాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ–520004. *e-mails:* ncharithra@rediffmail.com; ncharithra@gmail.com
దూరవాణి: (కార్యాలయం) 0866 – *2439466* సంపాదకుడు : *98480 16136*

రచయితలకు విజ్ఞప్తి : మీ రచనలతోపాటు, హామీ పత్రాన్ని తప్పక జతపరచాలి. ఆ రచన ఏ ఇతర పత్రిక పరిశీలనలో లేదనీ కేవలం నడుస్తున్నచరిత్రలో ప్రచురణకు మాత్రమే పంపుతున్నామని హామీ పత్రంలో వ్రాయాలి. మీ పేరు, పూర్తి చిరునామా, ఫోను నెంబరు తెలియపరచాలి.

సంపాదకీయం

# తెలుగు నుడినీ, జాతి గౌరవాన్ని నిలపండి

గిరిజన తెగలకు వారి తల్లిభాషల్లోనే ప్రాథమిక విద్య నేర్పాలనే బుద్ధి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కలిగింది. ఎవరికైనాసరే వారి తల్లిభాషలోనే కనీసం ప్రాథమిక విద్య నేర్పాలనే ఇంగిత జ్ఞానాన్ని కోల్పోయిన మన ప్రభుత్వానికి ఇంత మంచి ఆలోచన ఎలా వచ్చిందో చర్చించే సందర్భం ఇది కాదుగాని, ఆ మంచి ప్రయత్నంలో భాగంగా గిరిజన భాషల్లో వాచకాలు వ్రాయించారు. వాటిని మచ్చుకు ఒకటి రెండు చూచినా తెలుగువాడికి రెండు సంగతులు నికరంగా తెలుస్తాయి. 'కొలవ' భాషలో వేసిన వాచకం ప్రకారం, ఒకటి– మనం నిజానికి తెలుగువాళ్ళం కాదు– కొలవ / గోండి వంటి తెగలకు సంబంధించిన వాళ్ళం. రెండవది – సంస్కృత పదాలనే తెలుగు అంటారు! ఆ వాచకం ప్రకారం తెలుగులో వసంత ఋతువు అంటే 'కొలవ' లో మామూలు ఉబ్బకాలం. గ్రీష్మఋతువు – తెలుగు; ఉబ్బకాలం – కొలవ. వర్షఋతువు – తెలుగు; వానకాలం– కొలవ. ఔషధం – తెలుగు; మందు – కొలవ; పక్షి – తెలుగు; పిట్ట – కొలవ . ఇలా ఎన్నో పదాలు!

మన తెలుగు పాఠ్యపుస్తకాల్లో తెలుగును అర్థంకానంతగా సంస్కృతీకరించడంతో ఇంట్లో, నివసించే ప్రాంతంలో మాట్లాడే భాషకూ పాఠశాలలో చదవాల్సిన భాషకూ ఎక్కడా పొంతన కుదరదు అందువల్ల తెలుగంటేనే మధ్య, క్రింది సామాజిక తరగతుల పిల్లలు ఎంతగా దూరమవుతున్నారో మనకు తెలియంది కాదు. ఇదంతా ఒక వెత. దాని లోతుపాతులు ఇక్కడ చర్చించాలని కాదుగాని, ప్రాథమిక విద్యలోనే తెలుగును ఎన్నిరకాలుగా చితకగొడుతున్నారో తెలుసుకోవడానికే ఇక్కడీ సంగతి. ఇందుకు ఒడిగడుతున్న వారందరికీ తెలుగుపట్ల ఉండే ప్రేమను ఇప్పుడు అంచనా వెయ్యండి.

మరొకవైపు చూద్దాం. తెలుగు కన్నడాల్లో పండితుడూ, రచయితా అయిన ఒక పెద్దాయన ఒక చోట – 'రాయలసీమలో చిత్తూరు జిల్లా పైన తమిళ ప్రభావం, అనంతపురం కర్నూలు జిల్లాలపైన కన్నడ ప్రభావం ఉంటుంది. రాయలసీమలో కడప జిల్లా తెలుగు మాత్రమే స్వచ్ఛమైన తెలుగు' అని వ్రాశారు! అయితే పొరుగు రాష్ట్రాల్లో మన సరిహద్దున ఉన్న జిల్లాల్లో తెలుగు ప్రభావం ఎంతుందో (నిజానికి అవి ఎక్కువలో ఎక్కువ తెలుగు ప్రాంతాలే) ఆయన వ్రాయరుగాక వ్రాయరు! ఒక ప్రఖ్యాత కథా రచయిత వ్రాసిన కథలో చీరాల నుండి బయలుదేరిన ఒక పాత్ర– కావలి దాటి నెల్లూరు దగ్గరకు రాగానే 'నెల్లూరు పట్టణమంతా అరవమయం' అని అంటుంది. ఒక కవి, పాత్రికేయుడు ఒక దిన పత్రికలో తాను నిర్వహించే 'కాలం'లో వ్రాస్తూ – ఇడ్లీ, దోశె లాంటి తమిళ చిరుతిళ్ళు వందేళ్ళ క్రితమే నెల్లూరు పట్టణంలో ప్రచారమయ్యాయని వ్రాశారు. ఇటీవలే ప్రచురించబడిన ఒక స్వాతంత్ర్య సమరయోధురాలి గురించి మరొక గొప్ప వ్యక్తి వ్రాసిన జీవిత చరిత్ర పుస్తకంలో – నెల్లూరు ప్రాంతాల్లో వాడే 'ఉర్లగడ్డలు' అనే మాట 'ఉరళైకిళంగు' అనే తమిళమాట నుంచి వచ్చిందని వ్రాశారు. ఇదే కోవలో అనేకమంది తెలుగు రచయితలు, పండితులు తమ చేతనైనంతగా తెలుగును అవమానించారు. ఇక తెలంగాణ అస్తిత్వ ఉద్యమంలో తమకు తెలియకపోయినా, ఆమాట తెలంగాణది ఈ మాట కోస్తాది అంటూ మాట్లాడుతున్న వాటిని, వ్రాస్తున్న వాటిని లెక్కిస్తే వారి తెలియనితనానికి, తొందరపాటుకు బాధపడక తప్పడంలేదు. 610 జి.ఒ. ప్రకారం ఉద్యోగుల ప్రాంతీయత గుర్తింపుకు సొరకాయ, ఆనపకాయలకు ప్రాంతీయ భేదాన్ని ఆపాదించి నిర్వచించాడొక రాజకీయ నాయకుడు. ఇది చిన్న విషయమేకాని, పండితులు, చదువుకొన్నవారు, రచయితలు, బహుభాషావేత్తలు తెలుగును అవమానించే విధంగా వ్రాయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి.

తెలుగు భాష అస్తిత్వ సంక్షోభంలో ఉందని భావిస్తూ, దానిని అన్ని విధాలా ఉద్ధరించుకోవాలని ముందుకు తెచ్చే అంశాలలో నాడూ నేడూ తెలుగు ఎదుర్కొంటున్న దాడులను వివరించి, పరభాషలతో ఇచ్చి పుచ్చుకోవడం భాష అభివృద్ధికి తోడ్పడుతుందనీ అంతమాత్రాన తెలుగు తన స్వంత పద సంపదను కోల్పోతూ పరభాషల పదాలను నెత్తిన వేసుకోవడం తగదనీ భాషోద్యమకారులు మాట్లాడిన సందర్భాల్లో– వారిని ఎదుర్కొంటున్న వారిలో

సంపాదకీయం

ఎక్కువమంది తెలుగువారుగా పుట్టి తెలుగు బోధనపై ఆధారపడి బ్రతుకుతున్నవారే. వాళ్ళకు తెలుగంటే ఎంత పట్టనితనమంటే తెలుగు భాషకోసం ఎవరెంత గోలపెట్టినా, 'అప్ప(అక్క) ఆరాటమే తప్ప బావ బ్రతికేది లేదు' అనే సామెతను ఉదాహరించాడొకాయన. ఇలాంటి పెద్దమనుషులు మన తెలుగువారిలో అనేక విధాలుగా మనకు తారసపడతారు. వీరిలో సంస్కృతాన్ని మొయ్యడం కొందరి పని కాగా – సంస్కృతాన్ని వ్యతిరేకించడం కోసం తమిళాన్ని మొయ్యడం మరికొందరిపని. సంస్కృతాన్ని వ్యతిరేకిస్తూ ఉర్దూనో, ఇంగ్లీష్‌నో మొయ్యడం మరికొందరి పని. మనదంటూ ఏమీ లేదనుకొంటూ, మన భాషలోకి మనం చూడకుండా, పరభాషల్ని మొయ్యడమే పనిగా పెట్టుకొని, మనం ఎంతవరకు ముందుకు సాగుతాం?

అవసరమున్నా లేకపోయినా ప్రతిచోటా ఇంగ్లీష్‌నో, లేదా తెలుగు తప్ప మరొక భాషనో మొయ్యడం – దేన్ని సూచిస్తుంది? పాఠశాలల్లో చేరినప్పటినుండి జీవితంలో అన్ని దశల్లోనూ ఇదే పరిస్థితిని తెలుగువాడు ఎదుర్కొంటున్నాడు గనుకనే గుర్తింపు చీటీ (విజిటింగ్ కార్డు)ల్లో ఇంగ్లీషు తప్ప తెలుగుండదు! ఇంగ్లీషులోనే తప్ప తన సంతకాన్ని తెలుగులో చెయ్యడు! పలకరింపుల్నీ సానుభూతినీ, అభినందనల్నీ శుభాకాంక్షల్నీ తెలుగులో చెప్పడు. ఏ మంచి చెడు సందర్భాల్లోనూ, జీవితంలో ముఖ్య ఘట్టాల్లోనూ తెలుగు పనికిరాదు. మరి ఈ జాతి ఇన్ని వేలేళ్ళుగా ఎలా జీవించింది? ఎన్నడూ ఈ జాతికి తనదైన'తనం' అనేదే లేదా? ఇలావెతుక్కొంటూ లోతుకుపోతే – తెలుగు ఎన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక చిత్రహింసలకు గురి అయిందో తెల్లం అవుతుంది.

అన్నిటికంటే విచిత్రం కొందరు భాషా శాస్త్రజ్ఞుల ధోరణి! కొందరు భాషా పండితుల ధోరణి! సంస్కృతంపై ఆధారపడకుండా వీరొక్క కొత్త మాటను ముందుకు తేలేరు. తెలుగుపదాల వ్యుత్పత్తిలోకి వెళ్ళాలంటే జంకుతారు, సిగ్గుపడతారు. ధైర్యం చెయ్యలేరు. కాదంటే ద్రవిడ వ్యుత్పత్తి పదకోశాలవైపు చూస్తారు! స్వంతంగా ఆలోచించడం, తెలుగుదనంతో, తెలుగుపై నమ్మకంతో ఆలోచించడం అనేదే లేదు. ఏదో తెలియని భయం వీరిని లొంగదీసుకొంది. తెలుగుకు 'క్లాసికల్' భాషా ప్రతిపత్తి కోసం జరిగిన ప్రయత్నాల సందర్భంలో వీరి వ్యవహరణ ఆత్మగౌరవం గల తెలుగు ప్రజలకు సిగ్గుచేటనిపించింది.

చదువుకున్నవారు, పండితులు, రచయితలు రాజ్యానికీ, ప్రజలకూ దారి దీపాలుగా ఉండాలి. కాని, వీరు తమ పాత్ర నిర్వహణలో శతాబ్దాలుగా విఫలమయ్యారు గనుకనే తెలుగు నుడి, నుడికారం, తెలుగు ప్రజల అభ్యుదయం, గుర్తింపు ఈ దశకు దిగజారాయి. నేటి ప్రభుత్వాలు తెలుగుపట్ల పట్టనితనంతో వ్యవహరించడానికి వీరే కారణం. తమ భాష తమను ముందుకు తీసుకుపోలేదని, తమకు చిన్నతనాన్ని కలిగించడానికే తప్ప గౌరవాన్ని కలిగించదనే మనోస్థితికి తెలుగు ప్రజలు చేరుకోవడానికీ వీరే కారణం. ఇప్పుడు మనం తెలుగుకోసం 'గుండెలు బాదుకోవడం' ఇందువల్లే.

ఏ సమాజంలోనైనా తమకంటె బాగా చదువుకొన్నవారు, ఉన్నతస్థితిలో వున్నవారు ఏ విలువలను గౌరవిస్తుంటే కిందివారు కూడా వాటినే అనుసరిస్తారు. కులం పేరుతో సామాజిక వర్గాలుగా విడిపోయిన మన సమాజంలో కూడా ఇదే ధోరణి సాగుతోంది. భాషవిషయం కూడా అంతే. స్వాభిమానాన్ని వదులుకొని కేవలం స్వార్థంతో, అవకాశవాదంతో వ్యవహరిస్తున్న సామాజిక, రాజకీయ, వ్యాపార వర్గాలు, ఉన్నత విద్యావంతులదే ఇందుకు బాధ్యత.

కావలసింది– 'తెలుగు నాది, నా సమాజానిది' – అనే గాఢమైన నెనరు. తెలుగును రక్షించుకోవాలి, తెలుగును అన్ని విధాలా పెంపు చేసుకోవాలి అనే కోరిక. వేల ఏళ్ళ తెలుగును ప్రపంచ స్థాయి భాషగా తీర్చిదిద్దుకోవాలనే పట్టుదల. ఇందుకోసం ముందుకు సాగాలే తప్ప – కుంటివాడో, గ్రుడ్డివాడో, తెలివిలేనివాడో ఇతరులపై ఆధారపడినట్లు ఇతర భాషలపై ఆధారపడి మాత్రం కాదు. ఆధునిక భాషగా విలసిల్లడానికై– ముడుచుకుపోకుండా ఉండడమే కాదు– స్వాభిమానంతో ఇచ్చిపుచ్చుకోవాలి. ఈ దిక్కుగా తెలుగుపెద్దలు, యువత అంతా ఆలోచించాలని, వ్యవహరించాలని మా విన్నపం.

**5-6-2011**

సామల రమేష్‌బాబు

**ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=775**

*** * ***

**Read old issues of Nadustunna Charitra @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=60**